# ఆశీర్వదించండి.. సేవకుడిగా పని చేస్తా


కార్పెంటర్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

- యువతకు ఉపాధి కల్పనే ధ్యేయంగా రాబోయే పాలన
- పని చేసే ప్రభుత్వానికి అండగా నిలబడాలి
- పలు సంఘాల సమావేశాల్లో మంత్రి, సూర్యాపేట బీఆర్ఎస్ అభ్యర్థి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, నవంబర్ 6 : యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా సూర్యాపేటలో రాబోయే పాలన ఉంటుందని విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని కుడకుడలో అంత్యోదయ మహిళా పరస్పర సహకార పొదుపు సంఘం సర్వసభ్య సమావేశానికి, ది సూర్యాపేట కార్పెంటర్స్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రెండు పర్యాయాలు సూర్యాపేట ప్రజలకు చెప్పిన హామీలన్నీ నెరవేర్చామన్నారు. ప్రజలు కారు గుర్తుకు వేసిన ఓటు సూర్యాపేటలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను తీసుకొచ్చిందన్నారు. పేటలో పారిశ్రామిక హబ్ నెలకొల్పడమే తన లక్ష్యమన్నారు. ఐటీ పరిశ్రమను 3వేలకు విస్తరించాలన్నది తన సంకల్పమని పేర్కొన్నారు. కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. కాంగ్రెస్ గెలవడమంటే తోడేళ్ల మంద గొర్రె పిల్లలపై పడడమేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇల్లు లేని వారు ఉండకూడదనేది సీఎం కేసీఆర్ లక్ష్యం కాగా సూర్యాపేట నియోజకవర్గంలో ఇల్లు లేని వారు ఉండకూడదనేది తన లక్ష్యమన్నారు. గత మ్యానిఫెస్టోను నూటికి నూరుశాతం అమలు చేసిన ఏకైక నాయకుడు సీఎం కేసీఆర్ అని కొనియాడారు. బీఆర్ఎస్ పాలనలోనే మహిళా సంఘాల అభివృద్ధి జరిగిందన్న ఆయన పని చేసే ప్రభుత్వానికి సబ్బండ వర్గాలు అండగా నిలబడాలని కోరారు. మరోసారి ఎమ్మెల్యేగా ఆశీర్వదిస్తే సేవకుడిగా పని చేస్తానన్నారు. ఇప్పటికే ఎంతో అభివృద్ధి చేశామని, మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని భరోసానిచ్చారు. సీఎం కేసీఆర్ రూపొందించిన ఎన్నికల మ్యానిఫెస్టో అద్భుతంగా ఉందన్నారు. మళ్లీ అధికారంలోకి రాగానే మహిళలకు సౌభాగ్యలక్ష్మి అందిస్తామని, రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా చేస్తామని చెప్పారు. ప్రతిపక్ష నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అనంతరం సుమంగళి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యారు.


ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేసేందుకు వెళ్తున్న జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్

## ప్రాణం పోయినా బీఆర్ఎస్‌ను వీడేది లేదు

- జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్
- విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

బొడ్రాయిబజార్, నవంబర్ 6 : తన జెండా బీఆర్ఎస్, అజెండా మంత్రి జగదీశ్‌రెడ్డిని అని తాను పార్టీ మారుతున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లలో వాస్తవం లేదని జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్ పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని స్థానిక ఆర్డీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఎస్పీకి సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం విలేక రులతో మాట్లాడుతూ మంత్రి జగదీశ్‌రెడ్డి 50వేల మెజార్టీతో గెలుపు ఖాయమైన నేపథ్యంలో ప్రతిపక్షాలకు ఏం చేయాలో పాలుపోక తమ పార్టీ నాయకులపై, ప్రజాప్రతినిధులపై పుకార్లు పుట్టిస్తూ ప్రజలను సందిగ్ధంలో పడేస్తున్నారన్నారు. మంత్రి జగదీశ్‌రెడ్డి రాష్ట్రానికి ఆదర్శంగా సూర్యాపేటను అభివృద్ధి చేయడంతో ప్రతిపక్షాలు గెలిచే పరిస్థితి లేదన్నారు. అందుకే సోషల్ మీడియాలో ఫేక్‌న్యూస్ సృష్టిస్తూ ప్రజలను సందిగ్ధంలో పడేస్తున్నారన్నారు. ప్రజా క్షేత్రంలో బీఆర్ఎస్, మంత్రి జగదీశ్‌రెడ్డిని ఎదుర్కోలేక కుట్రలు చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. తన ప్రాణం పోయినా బీఆర్ఎస్‌ను వీడేది లేదని పేర్కొన్నారు. ఆయన వెంట ఆత్మకూర్.ఎస్ పీఏసీఎస్ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు మర్ల చంద్రారెడ్డి, బైరు వెంకన్నగౌడ్, నాగయ్య, పల్స వెంకన్న, బొల్లె జానయ్య, బొజ్జ మహేశ్ పాల్గొన్నారు

## జిల్లావ్యాప్తంగా 10నామినేషన్లు దాఖలు

సూర్యాపేట, నవంబర్ 6 : జిల్లావ్యాప్తంగా నాలుగు నియోజకవర్గాల్లో సోమవారం 10నామినేషన్లు దాఖలైనాయి. సూర్యాపేట నియోజకవర్గంలో3, కోదాడ నియోజకవర్గంలో5, హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 1, తుంగతుర్తి నియోజకవర్గంలో 1 నామినేషన్ వేశారు. దీంతో ఇప్పటి వరకు కోదాడ 8, సూర్యాపేట 5, తుంగతుర్తి 3, హుజూర్‌నగర్ 1 చొప్పున మొత్తం 17నామినేషన్లు దాఖలైనట్లు కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ తెలిపారు. జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరు నామినేషన్ వేయలేదు.

## పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు

బొడ్రాయిబజార్, నవంబర్ 6 : 2023–24 విద్యా సంవత్సరానికి జిల్లాలోని ప్రైవేట్ పారా మెడికల్ కళాశాలల్లో డిప్లోమా కోర్సులైన హెల్త్ అసిస్టెంట్ మగ, ల్యాబ్ టెక్నీషియన్, ఆప్తమాలజీ, అనస్తీషియా, ఇమేజింగ్ టెక్నీషియన్, రెడియోగ్రఫీ, ఈసీజీ టెక్నీషియన్, స్టెరిలైజేషన్ టెక్నీషియన్, డయాలసిస్, అప్తోమెట్రిక్ కోర్సుల్లో ప్రవేశానికి అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ లోపు దరఖాస్తులను డీఎంహెచ్ఓ కార్యాలయంలో జిల్లా వైద్యాధికారి కోటాచలం సోమవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని లక్ష్మి పారామెడికల్ ఇనిస్టిట్యూట్ సూర్యాపేట, పద్మావతి పారామెడికల్ కళాశాల తిరుమలగిరి, పవన్ ఎంపీహెచ్ డబ్ల్యూ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ సూర్యాపేట, సాహితీ ఎంపీహెచ్‌ఏ–ఎం సూర్యాపేట, సాయి చంద్ర డీఎంఎల్‌టీ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ సూర్యాపేట, సాయితేజ పార మెడికల్ ఇనిస్టిట్యూట్ సూర్యాపేట, సాయి వెంకటేశ్వర ఎంపీహెచ్‌ఏ ఇనిస్టిట్యూట్ సూర్యాపేట, సమత పారా మెడికల్ కళాశాల సూర్యాపేట, సత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ పారా మెడికల్ సూర్యాపేట, శ్రీ వినాయక కళాశాల, ట్రినిటి పారా మెడికల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యట్ సూర్యాపేట, వికాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎంపీహెచ్‌ఏ –ఎం కోదాడ, వినాయ పారామెడికల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ సూర్యాపేట, తిరుమల పారామెడికల్ కళాశాల కోదాడలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 8686588488 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## పేద మహిళలకు భరోసా సౌభాగ్యలక్ష్మి

- మంత్రి సతీమణి సునీతాజగదీశ్‌రెడ్డి ఇంటింటి ప్రచారం


కోమటికుంటలో ప్రచారం చేస్తున్న మంత్రి సతీమణి సునీతాజగదీశ్‌రెడ్డి

చివ్వెంల, నవంబర్ 6 : బీఆర్ఎస్ మరోసారి అధికారంలోకొచ్చాక అమలు చేయనున్న సౌభాగ్యలక్ష్మి పథకం పేద మహిళలకు భరోసా ఇస్తున్నదని మంత్రి సతీమణి సునీతాజగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కోమటి కుంటలో ప్రజాప్రతినిధులతో కలిసి సోమవారం ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సౌభాగ్యలక్ష్మి పథకంతో ప్రతినెలా రూ.3వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. భవిష్యత్ భద్రత బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. మంత్రి జగదీశ్‌రెడ్డి పాలనలో సాధించిన ప్రగతి విప్లవం వల్ల నియోజక వర్గంలోని గ్రామాలకు గుండె ధైర్యం వచ్చిందన్నారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో సూర్యాపేట నియోజకవర్గాన్ని అద్భుతంగా అభివృద్ధి చేశామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటేసి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మామిడి గౌరయ్య, జిల్లా నాయకులు గుర్రం సత్యనారాయణరెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్నికల విధులపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట, నవంబర్ 6 : ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులు, సిబ్బందితో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ సీహెచ్.ప్రియాంకతో కలిసి మాట్లాడారు. అందరూ కలిసి సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వహించాలన్నారు. అధికారులు, సిబ్బంది ఎన్నికల నియమావళిని తప్పక అనుసరించాలన్నారు. పీఓ, ఏపీఓ, ఓపీఓలు ఆయా నియోజక వర్గాల్లో రెండో విడుత ఇచ్చే శిక్షణ రోజున పోస్టల్ బ్యాలెట్ వేయాలని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ ఎక్కడైనా తప్పిదం జరిగితే నేరుగా సర్వీస్ నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. జిల్లాలో 300 సర్వీస్ ఓట్లు ఉన్నాయని ఆన్‌లైన్ ద్వారా సర్వీస్ ఓట్లు పరిశీలన జరుగుతుందన్నారు. ఒక నోడల్ అధికారిని సైతం నియమించామన్నారు. జిల్లాలో పీఓ, ఏపీఓలు 2,940మంది ఉండగా ఇప్పటి వరకు 2,162మంది పోస్టల్ బ్యాలెట్ ఫామ్‌లు అందుకున్నారని తెలిపారు. వికలాంగులు, 80ఏండ్లు పైబడిన వారు 1400మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున పోలింగ్ కేంద్రాల్లో మరుగుదొడ్లు, నీటి సదుపాయాలు, విద్యుత్, ఫ్యాన్లు, రాంపులు తప్పక ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈఓ సురేశ్, డీఎఫ్ఓ సతీశ్, సీపీఓ వెంకటేశ్వర్లు, డీహెచ్ఓ శ్రీధర్, డీఏఓ రామారావునాయక్, డీఈఓ అశోక్ పాల్గొన్నారు.

సూర్యాపేట : ఓటర్లకు ఇబ్బంది లేకుండా పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పిస్తామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.వెంకట్రావ్ అన్నారు. జిల్లాకేంద్రంలోని 60 ఫీట్స్ రోడ్డులోని ప్రభుత్వ గిరిజన బాలిక కళాశాల వసతి గృహంలోని 105,106, జయ స్కూల్‌లోని 103,104 రెండు పోలింగ్ కేంద్రాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు వేయడానికి వచ్చే వృద్ధులు, వికలాంగులకు ఇబ్బంది కలగకుండా సౌకర్యాలు చేయడం జరుగుతుందన్నారు.

# పలుచోట్ల గంజాయి స్వాధీనం

సూర్యాపేట సిటీ, నవంబర్ 6 : రాష్ట్ర సరిహద్దు కోదాడ మండలంలోని రామాపురం చెక్‌పోస్టు వద్ద పోలీసుల తనిఖీలో రూ.12.5లక్షల విలువైన 50కిలోల గంజాయి పట్టుబడింది. మహారాష్ట్రకు చెందిన ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.30వేల నగదు, 3సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కోదాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాహుల్ హెగ్డే కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. రామాపురం చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలో ఆంధ్రా నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ప్రైవేట్ బస్సులో గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న పురుషుడు, ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. వారు మహారాష్ట్ర రాష్ట్రంలోని రాయగడ్ జిల్లా వాసి అవదేశ్ చంద్రశేఖర్‌వర్మ, అదే ప్రాంతానికి చెందిన గృహిణులు శైల ప్రదీప్ దండకర్, సారిక విలాస్ మెహితెగా గుర్తించామన్నారు. గంజాయి తరలిస్తున్న వారిని పట్టుకోవడంలో ప్రతిభ చూపిన కోదాడ డీఎస్పీ బి.ప్రకాశ్, సీఐ డి.రామకృష్ణారెడ్డి, రూరల్ ఎస్ఐ సాయి ప్రశాంత్, హెడ్ కానిస్టేబుల్ ఎస్కే.అబ్దుల్ సమద్‌ను ఎస్పీ అభినందించారు.


సూర్యాపేట సిటీ : వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ : 10మంది దగ్గర 1.2కిలోల గంజాయి స్వాధీనం చేసుకోవడంతో పాటు రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాజశేఖర్ సోమవారం తెలిపారు. పట్టణ ఎస్ఐ యాకుబ్ సిబ్బందితో కొత్త వ్యవసాయ మార్కెట్ వద్దకు వెళ్లగా అక్కడ 10మంది అనుమానాస్పదంగా పారిపోయేందుకు ప్రయత్నించగా వారిని పట్టుకున్నారు. వారి వద్ద చిన్న చిన్న కవర్లలో మొత్తంగా కిలో 200గ్రాముల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. సూర్యాపేట అంబేద్కర్‌నగర్‌కు చెందిన షేక్ షరీఫ్, దున్న విక్రమ్, తిరుపతి మదన్, కాసరబాదకు చెందిన మల్లెబోయిన సాయి, సూర్యాపేటకు చెందిన రత్నాల శంకర్, నకిరేకల్ మండలం చందంపల్లికి చెందిన పాలడుగు నరేందర్, పడిదెల మనోహర్, సూర్యాపేటకు చెందిన అబ్బగోని శ్రీమాన్, నల్లగొండ మండలం కట్టంగూర్ అంబేద్కర్ నగర్‌కు చెందిన మేడి పవన్, సూర్యాపేట అంబేద్కర్‌నగర్‌కు చెందిన గుగులోతు అరుణ్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు.

చివ్వెంల : గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పరిధిలోని కుడకుడ శివారులో వాహనాల తనిఖీలు చేస్తుండగా ముగ్గురు యువకులు స్కూటర్‌పై వెళ్తూ అకస్మాత్తుగా ఆపారు. వారిలోంచి ఓ యువకుడు పరారవ్వడంతో మిగతా వారిని అదుపులోకి తీసుకుని విచారించగా 400 గ్రాముల గంజాయి పట్టుబడినట్లు తెలిపారు. కుడకుడకు చెందిన కంచుగొమ్మల శివ అలియాస్ చింటు, దాదె టోని అలియాస్ అనుదీప్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తలించారు.

## మంత్రి జగదీశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

- జడ్పీటీసీ భిక్షం


జాటోతు తండాలో ప్రచారం చేస్తున్న జడ్పీటీసీ భిక్షం

సూర్యాపేట రూరల్, నవంబర్ 6 : వచ్చే ఎన్నికలో మంత్రి జగదీశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని జడ్పీటీసీ జీడి భిక్షం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వంగాల శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మండలంలోని జాటోతుతండాలో సోమవారం బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్‌ను ముచ్చటగా మూడోసారి గెలిపించాలని ఇంటింటికి తిరిగి ఓటర్లను కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.